www.prajasakti.com

ప్రజాశక్తి

ఆదివారం 12 మార్చి 2023

## బాల్య వివాహాన్ని అడ్డుకున్న పోలీసులు

ప్రజాశక్తి-రాజంపేట అర్బన్

జిల్లా పరిషత్ బాలికోన్నత పాఠశాలలో ఏడవ తరగతి చదువుతున్న ఓ విద్యార్థినికి ఆమె తల్లి వివాహం చేసేందుకు ఏర్పాట్లు చేసుకున్నారు. శనివారం తెల్లవారుజామున వివాహ ముహూర్తం ఉండగా సమాచారం అందుకున్న అర్బన్ ఎస్ఐ లక్ష్మీ ప్రసాద్‌రెడ్డి వేగంగా స్పందించి సంక్షేమ వసతి గృహ అధికారి శోభారాణినికి ఫోన్‌లో సంప్రదించి విద్యార్థిని తల్లిదండ్రుల సమాచారం, ఫోన్ నంబర్ వంటి వివరాలను తీసుకుని ఆరా తీయగా విద్యార్థిని తల్లి ఫోన్ స్విచ్ ఆఫ్ చేసుకుని ఉండడంతో ఫోన్ నెంబర్ ఆధారంగా లొకేషన్ సెర్చ్ చేశారు. అర్ధరాత్రి ఒంటిగంట ప్రాంతంలో వేణుగోపాలస్వామి ఆలయంలో వివాహం జరుగుతున్నట్లు గుర్తించి బాల్యవివాహాన్ని అడ్డుకున్నారు. వార్డెన్ శోభారాణి సహకారంతో ఎస్ఐ ప్రత్యేక శ్రద్ధ వలన అతి చిన్న వయసులో జరుగుతున్న బాల్యవివాహాన్ని అడ్డుకొని ఆ బాలిక మరికొన్ని సంవత్సరాలు పాటు చదువును కొనసాగించే అవకాశం కలిగించారు. విద్యార్థిని ఓబులవారిపల్లి మండలం కాగా వరుడు పుల్లంపేట మండలానికి చెందిన వ్యక్తి. 11 ఏళ్ల బాలిక వివాహాన్ని అడ్డుకొని ఆమె విద్యాభ్యాసానికి, భవిష్యత్తుకు మంచి పునాది వేసిన ఎస్ఐ లక్ష్మీ ప్రసాద్ రెడ్డి ప్రయత్నాన్ని పలువురు ప్రశంసిస్తున్నారు.

# అవినీతి అక్రమాల భరతం పడతాం

అంగళ్లు వద్ద పాదయాత్రలో అభివాదం చేస్తున్న నారా లోకేష్

- జగన్ పాలనలో అందరూ బాధితులే
- పేదలపై పన్నుల భారం తగ్గిస్తాం
- పాదయాత్రలో నారా లోకేష్
- నేడు, రేపు యువగళం పాదయాత్రకు విరామం

ప్రజాశక్తి-కురబలకోట

తంబళ్లపల్లె నియోజకవర్గంలో వైసిపి నాయకులు చేస్తున్న అవినీతి అక్రమాల భరతం పడతామనిటిడిపి జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేష్ అన్నారు. యువగళం పేరుతో లోకేష్ చేపట్టిన పాదయాత్ర 41వ రోజుకు చేరుకుంది. శనివారం అన్నమయ్య జిల్లా తంబళ్లపల్లె నియోజకవర్గం కురబలకోటలోని నందిరెడ్డివారిపల్లె చేనేతనగర్ నుంచి ప్రారంభమైన పాదయాత్ర నందిరెడ్డివారిపల్లె, తట్టివారిపల్లె, అంగళ్లు, దొమ్మనబావి, కంటేవారిపల్లె వరకూ పాదయాత్ర సాగింది. 9.05 కిలోమీటర్లు సాగిన పాదయాత్ర సందర్భంగా ఆయా ప్రాంతాల్లో కురుబలు, కుమ్మరి సామాజిక వర్గాల వారితో మాటామంతి కార్యక్రమాలు నిర్వహించారు. ఈ సందర్భంగా లోకేష్ మాట్లాడుతూ ముఖ్యమంత్రి జగన్ పాలనలో అందరూ బాధితులేనని తెలిపారు. పెట్రోల్, డీజిల్‌పై వేస్తున్న అసాధారణ పన్నుల వలనే నిత్యావసర సరుకుల ధరలు విపరీతంగా పెరిగిపోయాయన్నారు. టిడిపి అధికారంలోకి వచ్చిన వెంటనే నిత్యావసర సరుకుల ధరలు తగ్గిస్తామని తెలిపారు. అడ్డగోలుగా పెంచిన అన్ని పన్నులు, పేద వాడిపై పన్నుల భారం తగ్గిస్తామని పేర్కొన్నారు. రాష్ట్రంలో 6 లక్షల పెన్షన్లు కట్ చేశారని తెలిపారు. ఆఖరికి చెత్త పన్ను కూడా పెన్షన్‌లో కట్ చేసే దారుణమైన ప్రభుత్వం మరొకటి లేదన్నారు. టిడిపి ప్రభుత్వం వచ్చిన వెంటనే అర్హులైన అందరికీ పెన్షన్లు ఇచ్చి తీరుతామన్నారు. ప్రతి నియోజకవర్గంలో ఇండస్ట్రియల్ క్లస్టర్స్ ఏర్పాటు చేసి చిన్న, మధ్య తరగతి పరిశ్రమలను ప్రోత్సహిస్తామని తెలిపారు. శాలివాహన సామాజికవర్గ అభివృద్ధికి కట్టుబడి ఉన్నామని తెలిపారు. ఆదరణ ద్వారా గతంలో వేలాది రూపాయల విలువ చేసే పనిముట్లు అందించామని చెప్పారు. టిడిపి హయాంలో అంగళ్లలో సీఎఫ్సీ భవనం నిర్మించామన్నారు. వారంతా ఒకేచోట ఉండి పని చేసుకుంటున్నారని పేర్కొన్నారు. అధికారంలోకి వచ్చాక కంటెవారిపల్లెలోనూ సీఎఫ్సీ బిల్డింగ్ నిర్మించే ప్రయత్నం చేస్తామని హామీ ఇచ్చారు. కుమ్మరుల ఉత్పత్తుల సేల్‌ను అధికారంలోకి రాగానే తాము ప్రమోట్ చేస్తామన్నారు. కురుబల కోసం తొలుత కురుబ కార్పొరేషన్ ఏర్పాటు చేసి వారి సంక్షేమానికి కృషి చేశామన్నారు. రాబోయే ఎన్నికల్లో టిడిపి అధికారంలోకి వచ్చాక గొర్రెల మేపుకోవడానికి బీడు భూములు కేటాయించే అంశాన్ని పరిశీలిస్తామని హామీ ఇచ్చారు. కురుబల ఆరాధ్య దైవం కనకదాసు జయంతిని అధికారికంగా నిర్వహిస్తామన్నారు. కురుబ భవనాల ఏర్పాటుకు నిధులు కేటాయిస్తామన్నారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే శంకర్‌యాదవ్, రాజంపేట పార్లమెంట్ టిడిపి అభ్యర్థి గంటా నరహరి, పర్వీన్ తాజ్ పాల్గొన్నారు.

### నేడు, రేపు యువగళం పాదయాత్రకు విరామం

టిడిపి జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేష్ చేపట్టిన యువగళం పాదయాత్ర అన్నమయ్య జిల్లా తంబళ్లపల్లె నియోజకవర్గంలో సాగుతోంది. ఎన్నికల నిబంధనల ప్రకారం ప్రస్తుతం నియోజకవర్గం వీడాలంటూ లోకేష్‌కు ప్రధాన ఎన్నికల అధికారి కార్యాలయం ఆదేశాలు జారీ చేశారు. రాష్ట్ర వ్యాప్తంగా పాదయాత్ర చేసేందుకు ముందుగానే నిర్ణయించుకున్నందున తాను స్థానికంగా అన్నమయ్య జిల్లా కంటేవారిపల్లి విడిది కేంద్రంలో ఉండేందుకు మినహాయింపు ఇవ్వాలని కేంద్ర ఎన్నికల సంఘాన్ని నారా లోకేష్ కోరారు. లోకేష్ పంపిన విజ్ఞప్తిని కేంద్ర ఎన్నికల సంఘం పైవిధంగా స్పందించింది. ఎన్నికల సంఘాన్ని, చట్టాలను గౌరవించి జిల్లా వీడుతున్నట్లు లోకేష్ ప్రకటించారు. కంటేవారిపల్లి నుంచి హైదరాబాద్ బయలుదేరి వెళ్లారు. ఇప్పటి వరకు నడిచిన దూరం 529.1 కిలోమీటర్లు కాగా 41వ రోజు శనివారం నడిచిన దూరం 9.5 కిలోమీటర్లు. ఎమ్మెల్సీ ఎన్నికల కోడ్ కారణంగా యువగళం పాదయాత్రకు 12, 13వ తేదీల్లో విరామం ప్రకటించారు. 42వ రోజు పాదయాత్ర 14వ తేదీ కంటేవారిపల్లి నుంచి ప్రారంభమవుతుందని పార్టీ శ్రేణులు ప్రకటించారు.

# ష్..గప్‌చుప్!

ప్రలోభాలకు వేళాయే!

యథేచ్ఛగా ఓటుకు నోటు

ఉపాధ్యాయులకు రూ.5 వేలు?

పట్టభద్రులకు రూ.వెయ్యి పంపిణీ?

ప్రజాశక్తి - కడప ప్రతినిధి

జిల్లాలో ఎన్నికల ప్రచార ఘట్టం ముగియడంతో గప్‌చుప్ వాతావరణం నెలకొంది. పశ్చిమ రాయలసీమ ఎమ్మెల్సీ పరిధిలో శనివారం సాయంత్రం నుంచి బహిరంగ రాజకీయ, ప్రచార, సోషల్ మీడియా ప్రచారం వంటి కార్యకలాపాలకు ఎన్నికల కమిషన్ అడ్డుకట్ట పడింది. ఎమ్మెల్సీ ఎన్నికల బరిలో దిగిన సుమారు 51 మంది పట్టభద్ర, ఉపాధ్యాయ అభ్యర్థులు ఓటింగ్ పోలరైజేషన్ వైపు దృష్టి సారించారు. పిడిఎఫ్ మినహా అధికార పార్టీ మద్దతుదారుల నుంచి మిగిలిన ప్రత్యర్థుల వరకు ఎవరి స్థాయిలో వారు ప్రలోభాలకు తెర లేపినట్లు తెలుస్తోంది. ఇప్పటికే రాష్ట్ర స్థాయి అధికారుల నుంచి అధికార మద్దతుదారు ఉపాధ్యాయ ఎమ్మెల్సీ అభ్యర్థుల వరకు ప్రలోభాలకు పాల్పడడం చర్చనీయాంశంగా మారిన సంగతి తెలిసిందే. పశ్చిమ రాయలసీమ ఎమ్మెల్సీ ఎన్నిక వ్యవహారం రాష్ట్ర స్థాయిని ఆకర్షించింది. ఇటువంటి పరిస్థితుల్లోనే స్థానిక సంస్థల ఎమ్మెల్సీ ఎన్నిక ఏకగ్రీవం కావడం అందరి దృష్టినీ ఆకర్షించింది. ప్రచార దశలోనే ప్రలోభాలకు తెరలేచింది. అధికార పార్టీ మద్దతు కలిగిన ఎమ్మెల్సీ అభ్యర్థుల అనుచరులు టిఫిన్ బాక్సుల దగ్గర నుంచి నగదు పంపిణీ వరకు భారీగా ప్రలోభాలకు తెరలేపడం చర్చనీయాంశంగా మారిన సంగతి తెలిసిందే. పశ్చిమ రాయలసీమ ఎమ్మెల్సీ నియోజకవర్గ పరిధిలో 1,41, 400 ఉపాధ్యాయ 2.09,800 పట్టభద్ర ఓటర్లు ఉన్న సంగతి తెలిసిందే. జిల్లాలోని 82 వేల మంది పట్టభద్రులు, సుమారు ఏడు వేల మంది ఉపాధ్యాయులు ఉన్నారు. వీరిలో అత్యధికులకు నగదు పంపిణీ చేసి ప్రలోభాలకు తెరలేపడం చర్చనీయాంశంగా మారింది. అత్యధికంగా ఉపాధ్యాయ ఓటరుకు రూ.ఐదు వేలు, పట్టభద్ర ఓటరుకు రూ.వెయ్యి నుంచి రూ.2 వేల వరకు పంపిణీ చేస్తున్నట్లు సమాచారం. జిల్లా పరిధిలో గత 10 రోజులుగా బద్వేల్ నియోజకవర్గ పరిధిలోని నగదు పంపిణీ వ్యవహారం హాట్‌టాపిక్‌గా మారిందనే వార్తలు వెల్లువెత్తుతుండడం గమనార్హం. శనివారం సాయంత్రంతో ప్రచారఘట్టం ముగిసిన అనంతరం పోలింగ్ సమయానికి 48 గంటలను ఓటింగ్ పోలరైజేషన్ పేరుతో ప్రలోభాల పర్వం జోరందుకునే అవకాశం ఉంది. అధికార పార్టీ పరోక్ష మద్దతు పొందిన ఉపాధ్యాయ, పట్టభద్ర ఎమ్మెల్సీ అభ్యర్థులకు ఏజెంట్ల నియామకం దగ్గర నుంచి పోలింగ్, కౌంటింగ్ దశల వరకు వెసులుబాటు ఉంటుందనే వాదన వినిపిస్తోంది. ఏదేమైనా విద్యావంతులైన ఉపాధ్యాయ, పట్టభద్ర ఎమ్మెల్సీ ఎన్నికల్లో ఓటర్లు ఓటింగ్‌లో వివేకాన్ని, విజ్ఞతను ప్రదర్శించే అవకాశం ఉందనే విశ్లేషకుల అంచనాలు ఎలా ఉంటాయో వేచి చూడాల్సి ఉంది.

మాట్లాడుతున్న డిఇఒ రాఘవరెడ్డి

## 'పది'లో ఉత్తమ ఫలితాలు సాధించాలి : డిఇఒ

ప్రజాశక్తి - రాయచోటి

పదవ తరగతి విద్యార్థులు ఏకాగ్రత, పట్టుదలతో ప్రణాళిక బద్ధంగా చదివి ఉత్తమ ఫలితాలు సాధించాలని జిల్లా విద్యాశాఖాధికారి ఎద్దుల రాఘవరెడ్డి పేర్కొన్నారు. శనివారం సంబేపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఏర్పాటుచేసిన పదవ తరగతి విద్యార్థుల తల్లిదండ్రుల సమావేశానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులు బాగా చదివేందుకు తల్లిదండ్రుల సహకారం ఎంతో అవసరం అన్నారు. ఇంటిదగ్గర విద్యార్థులు చదివేటప్పుడు వారి ఏకాగ్రతకు భంగం కలగకుండా ఉండేందుకు తల్లిదండ్రులు టీవీలు పెట్టకూడదన్నారు. పరీక్షలు ప్రారంభానికి కేవలం 20 రోజులు మాత్రమే ఉన్నాయని విద్యార్థులు ఆరోగ్యంగా ఉండేందుకు తల్లిదండ్రులు మంచి పౌష్టికాహారాన్ని అందించాలన్నారు. విద్యార్థుల బంగారు భవిష్యత్తుకు పదవ తరగతి మొదటి మెట్టన్నారు. ఒత్తిడికి లోను కాకుండా బాగా చదివి మంచి మార్కులు సాధించాలన్నారు. ఉపాధ్యాయులు సి గ్రేడ్, డి గ్రేడ్ విద్యార్థులపై ప్రత్యేక దృష్టి పెట్టాలన్నారు. విద్యార్థులకు మాదిరి ప్రశ్నాపత్రాలు ఇచ్చి అవగాహన కల్పించాలన్నారు. ఇప్పటికే సిలబస్ పూర్తి అయిందని మరొక మారు ముఖ్యమైన భావనలపై విద్యార్థులకు అవగాహన కల్పించాలన్నారు. పటాలు, గ్రాఫులు, పట్టికలపై విద్యార్థులు సాధన చేయడం ద్వారా మంచి మార్కులు సాధించవచ్చున్నారు. పదవ తరగతి పరీక్షలను అత్యంత పారదర్శకంగా, పకడ్బందీగా నిర్వహిస్తామన్నారు. ఈ సందర్భంగా విద్యార్థుల తల్లిదండ్రులు డిఇఒను ఘనంగా సన్మానించారు. అనంతరం ప్రధానోపాధ్యాయులు మడితాటి నరసింహారెడ్డి ఆధ్వర్యంలో ఉత్తమ సేవలందించిన పాఠశాలలోని ఉపాధ్యాయులు శంకరయ్య, జయరామ నాయక్, విజయ సారథి రెడ్డి, రామకృష్ణ నాయక్ లను పూలమాలలతో, దుశ్శాలువులతో డిఇఒ ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో సర్పంచ్ అంచల రామచంద్ర, డైట్ లెక్చరర్ వై సి రెడ్డప్పరెడ్డి, సైన్స్ ఆఫీసర్ మార్ల ఓబుల్ రెడ్డి, ఉపాధ్యాయులు రెడ్డయ్య రెడ్డి, నబి రసూల్, రామయ్య, వెంకట్రామరాజు, జోసఫ్, సురేంద్ర రాజు, పదవ తరగతి విద్యార్థులు, వారి తల్లిదండ్రులు పాల్గొన్నారు.

## తాత్కాలికంగా 'స్పందన' రద్దు

ప్రజాశక్తి - రాయచోటి

పట్టభద్రులు, ఉపాధ్యాయుల శాసనమండలి ఎన్నికల పోలింగ్ నేపథ్యంలో ఈ నెల 13న నిర్వహించనున్న స్పందన అర్జీల స్వీకరణ కార్యక్రమాన్ని తాత్కాలికంగా రద్దు చేస్తున్నట్లు కలెక్టర్ గిరీశ పిఎస్ శనివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. అర్జీదారులు ఈవిషయాన్ని గమనించి స్పందన ఫిర్యాదులను సమర్పించేందుకు కలెక్టరేట్‌కు రావద్దని తెలిపారు.

## ఎర్రచందనం స్మగ్లర్‌పై పీడీ యాక్ట్ ప్రయోగం

ప్రజాశక్తి - కడప అర్బన్

కరడు గట్టిన అంతర్ రాష్ట్ర ఎర్రచందనం స్మగ్లర్ షేక్. సింపతిల బాషా పై పీడీ యాక్ట ప్రయోగించినట్లు ఎస్‌పి అన్బురాజన్ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఇతను పదేళ్లుగా ఎర్ర చందనం దుంగల అక్రమ రవాణాకు పాల్పడుతున్నాడని తెలిపారు. 2013వ సంవత్సరం నుంచి ఇప్పటివరకు నిందితుడిపై 71 ఎర్రచం దనం కేసులు నమోదయ్యాయని పేర్కొ న్నారు. 2003 నుంచి ఇతనిపై 85 దొంగతనం కేసులు నమోదయ్యాయని తెలి పారు. ఇతనికి అనేక మంది అంత ర్జాతీయ ఎర్రచందనం స్మగ్లర్లతో సంబంధాలున్నాయని పేర్కొన్నారు. తమిళనాడు రాష్ట్రం నుంచి కూలీలను తీసుకుని వచ్చి జిల్లాలోని రైల్వే కోడూరు, బాలుపల్లి, సానిపాయ, అట్లూరు, చెన్నూర్, బద్వేల్, గువ్వలచెరువు ఘాట్, సుండుపల్లి ప్రాంతాల్లోని అటవీ ప్రాంతంలో దుంగలను నరికించి వాటిని దుంగలుగా చేయించి కర్ణాటక, తమిళనాడు రాష్ట్రాలకు అక్రమ రవాణా చేసి అంతర్జాతీయ ఎర్రచందనం స్మగ్లర్లకు విక్రయించి అక్రమంగా డబ్బులు సంపాదిస్తున్నాడని తెలిపారు. సింపతిల పై పీడీ చట్టం ప్రకారం చట్టపరమైన చర్యలు తీసుకోవాలని కలెక్టర్ ఆదేశించారని పేర్కొన్నారు. ఎర్ర చందనం అక్రమ రవాణా, రవాణాకు సహకరించిన వారి పై కఠిన చర్యలు ఉంటాయి తెలిపారు. అంతరాష్ట్ర ఎర్రచందనం స్మగ్లర్లను అరెస్టు చేసి పీడీ చట్టం కింద నిర్బంధ ఉత్తర్వులు పొందడానికి కృషి చేసిన సంబంధిత పోలీసు అధికారులను ఎస్.పి అభినందించారు.

## పబ్లిక్ పరీక్షలు కట్టుదిట్టంగా నిర్వహించాలి : కలెక్టర్

ప్రజాశక్తి - రాయచోటి

జిల్లాలో ఇంటర్మీడియట్ పరీక్షలు పకడ్బందీగా నిర్వహించేందుకు సంబంధిత అధికారులు అందరూ కృషి చేయాలని కలెక్టర్ గిరీష అన్నారు. శనివారం కలెక్టరేట్‌లోని వీడియో కాన్ఫరెన్స్ హాలో ఇంటర్, పదవ తరగతి పరీక్షలపై సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉదయం 9.00 గంటల నుండి మధ్యాహ్నం 12.00 గంటల వరకు పరీక్ష ఉంటుందనిమ తెలిపారు. పరీక్షా కేంద్రాల వద్ద144 సెక్షన్ ఏర్పాటు చేసి పటిష్ట పోలిస్ బందోబస్తు ఏర్పాటు చేయాలన్నారు. జిల్లాలో మొత్తం 52 పరీక్షా కేంద్రాలకు గాను ఇంటర్ మొదటి సంవత్సరం 13,934 మంది, రెండవ సంవత్సరం14,446 మంది, మొత్తం 28,380 మంది విద్యార్థులు పరీక్షలు రాయనున్నాని చెప్పారు. ఇంటర్ పరీక్షలలో ఎటువంటి అవకతవకలు జరగకుండా 10 మంది సిట్టింగ్ 4 ప్లేయింగ్ స్క్వాడ్‌లను ఏర్పాటు చేశామన్నారు. జిల్లాలో ఇంటర్, పదవ తరగతి పరీక్షలు ప్రశాంత వాతావరణంలో పగడ్బం దీగా నిర్వహించి జిల్లాకు మంచి పేరు తీసుకురావాలని సంబంధిత అధికా రులకు సూచించారు. అంతకుముందు రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి డాక్టర్ జవహ ర్‌రెడ్డి అన్ని జిల్లాల కలెక్టర్లను, ఎస్పీలతో నిర్వహించిన సమావేశంలో మాట్లా డారు. ఇంటర్ మీడియట్, పదవ తరగతి పబ్లిక్ పరీక్షలు కట్టుదిట్టంగా నిర్వహించాలని ఆదేశించారు. ఇంటర్మీడియట్, పదవ తరగతి పబ్లిక్ పరీక్షలలో ఎటువంటి సమస్యలు తలెత్తకుండా పకడ్బందీగా నిర్వహించాలన్నారు. మార్చి 15 నుంచి ఏప్రిల్ 4 వరకు ఇంటర్, ఏప్రిల్ 3 నుంచి 18 వరకు పదవ తరగతి పరీక్షలు నిర్వహిస్తామని చెప్పారు. పరీక్ష కేంద్రాలలో సిసి కెమెరాలు ఏర్పాటు చేసి అత్యంత పకడ్బందీగా పరీక్షలు నిర్వహించాలన్నారు. పరీక్షలు జరిగే రోజు పరీక్ష కేంద్రాల పరిసర ప్రాంతాలలో జిరాక్స్ సెంటర్లు మూసి వేయించి 144 సెక్షన్ విధించాలని సూచించారు. పరీక్ష కేంద్రంలోకి విద్యార్థులు సెల్ ఫోన్లు, ఎలక్ట్రానిక్ వస్తువులు తీసుకురాకూడదని పేర్కొన్నారు. ఎండ తీవ్రతను దృష్టిలో ఉంచుకొని తాగునీరు, ఒఆర్ఎస్ ప్యాకెట్లు అందుబాటులో ఉంచాలన్నారు. విద్యార్థుల సౌకర్యార్థం ఉదయం 7.00 గంటల నుంచి పరీక్షా కేంద్రాలకు బస్సు సౌకర్యం కల్పించాలని ఆర్టీసీ వారికి సూచించాలన్నారు. పరీక్షలలో ఎటువంటి మాస్ కాపీలు జరగకుండా ప్లేయింగ్ స్క్వాడ్, సిట్టింగ్ స్క్వాడ్ లను నియమించాలన్నారు. పరీక్ష కేంద్రాల వద్ద ఎఎన్ఎంలను నియమించి చేసి 108 వాహనం అందుబాటులో ఉంచాలన్నారు. ఇంటర్, పదవ తరగతి పరీక్షలు ప్రశాంత వాతావరణంలో జరిగేందుకు లా అండ్ ఆర్డర్ తప్పక పాటించాలన్నారు. సమావేశంలో ఎస్పీ హర్షవర్ధన్ రాజు, డిఆర్ఒ సత్యనారాయణ వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ గిరీష

## 'పిడిఎఫ్ ఎమ్మెల్సీ అభ్యర్థులను గెలిపించండి'

ప్రజాశక్తి-రాయచోటి టౌన్

పశ్చిమ రాయలసీమ శాసన మండలి ఎన్నికల్లో ఉద్యమాలకు బాసటగా నిలుస్తున్న పిడిఎఫ్ అభ్యర్థులను గెలిపించాలని సిఐటియు, ఎఐటియుసి జిల్లా ప్రధాన కార్యదర్శులు రామాంజులు, సాంబశివ అన్నారు. శనివారం ఎఐటియుసి కార్యాలయంలో నిర్వహించిన సమావేశంలో వారు మాట్లాడుతూ పశ్చిమ రాయలసీమ నుంచి కత్తి నరసింహారెడ్డి, పోతుల నాగరాజు పోటీ చేస్తున్నారని తెలిపారు. ఉద్యోగ, కార్మిక, ఉపాధ్యాయ, ప్రజా సంఘాలు బలపరుస్తున్నాయన్నారు. వారికి ఒకటవ ప్రాధాన్యతా ఓట్లు వేసి గెలిపించాల్సిందిగా ఉద్యోగులు, కార్మికులు, వారి కుటుంబసభ్యులను విజ్ఞప్తి చేశారు. కేంద్రంలోని బిజెపి, రాష్ట్ర వైసిపి పార్టీ ల అభ్యర్థులను, ఓడించి వారి పాలనకు కార్మిక, ఉద్యోగ, ఉపాధ్యాయులు వ్యతిరేకంగా ఉన్నారని ఈ ఎన్నికల్లో వారికి తగిన తీర్పు ఇవ్వాలని కోరారు. పిడిఎఫ్ అభ్యర్థులు 2007 నుండి ప్రజా సేవకు అంకితమై పని చేస్తున్నారని తెలిపారు. నీతిమంతమైన రాజకీయాలకు ప్రాతినిధ్యం వహిస్తున్నారు. వీరు సంపాదన కోసం కాకుండా ఉద్యోగులు, ఉపాధ్యాయులు, కార్మికుల సమస్యల పరిష్కారం పనిచేస్తున్నారని పేర్కొన్నారు. చట్ట సభ లోపల, వెలుపల ప్రజా ఉద్యమాలకు మద్దతుగా నిలబడుతున్నారని రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగులు, కాంట్రాక్ట్, అవుట్ సోర్సింగ్ ఉద్యోగులు, స్కీం వర్కర్లు, టైంస్కేల్, డైలీవేజ్ ఉద్యోగులు తదితరుల కోర్కెల పరిష్కారం కోసం ప్రభుత్వంతో రాయబారాలు నడుపుతున్నారన్నారు.. ఉద్యోగులు, కార్మికులతో కలిసి పోరాటాలలో పాల్గొంటున్నారని. ఇలాంటి అభ్యర్థులు గెలిస్తే ఉద్యోగులు, కార్మికులకు ప్రయోజనకరమని పేర్కొన్నారు. కార్యక్రమంలో ఎఐటియుసి జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ సిద్ధిగాళ్ళ శ్రీనివాసులు, నాయకులు బత్తల వెంకటరమణ, రాయచోటి పట్టణ కార్యదర్శి పుల్లయ్య, సిఐటియు నాయకులు ఫయాజ్ పాల్గొన్నారు.

మాట్లాడుతున్న సిఐటియు, ఎఐటియుసి నాయకులు

## క్రీడాకారులకు ఎల్లవేళలా తోడుంటా : 'గడికోట'

క్రికెట్ పోటీలను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే శ్రీకాంత్‌రెడ్డి

ప్రజాశక్తి - రాయచోటి టౌన్

నియోజకవర్గంలోని క్రీడాకారులకు ఎల్లవేళలా తోడుంటామని ఎమ్మెల్యే గడికోట శ్రీకాంత్‌రెడ్డి అన్నారు. రాయచోటి పట్టణంలోని ఈద్గా మైదానంలో అబూసిద్ధిక్ ట్రావెల్స్ స్పాన్సర్ షిప్‌తో, వైసిపి మైనారిటీ జిల్లా అధ్యక్షుడు బేపారి మహమ్మద్ ఖాన్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న క్రికెట్ టోర్నమెంట్ ఫైనల్ పోటీలను శనివారం ఆయన ప్రారంభించారు. తొలుత ఆయన క్రీడాకారులను పరిచయం చేసుకున్నారు. టాస్ వేసి ఫైనల్ పోటీలను ప్రారంభించారు. కొద్దిసేపు ఆయన బ్యాటింగ్ చేసి క్రీడాకారులను ఉత్సాహపరిచారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ 20 రోజుల పాటు 40 మ్యాచ్‌లను ఉత్సాహంగా నిర్వహించి ఫైనల్స్‌కు చేరుకోవడం హర్షనీయమన్నారు. టి -20 మ్యాచ్‌లు రాయచోటిలో నిర్వహించాలని ఆయన ఆకాక్షించారు. గెలుపోటములను సమానంగా స్వీకరించాలని చెప్పారు. యువత ఆవేశాలుకు ఎప్పుడూ లోనూ కాకూడదని, క్రమశిక్షణ, మంచి గుణాన్ని పెంపొందించు కోవాలన్నారు. రాబోయే తరాలకు ఉపయోగపడే విధంగా రాయచోటి నియోజకవర్గంలో అభివృద్ధి పనులు చేపడుతున్నామన్నారు. మున్సిపల్ చైర్మన్ ఫయాజ్ బాష మాట్లాడుతూ ఎంఎల్‌ఎ శ్రీకాంత్ రెడ్డి సారధ్యంలో త్వరలో సుమారు ఇరవై ఎకరాలలో రూ.50 కోట్ల నిధులతో క్రికెట్ స్టేడియం ఏర్పాటు కానుందన్నారు. వైస్ చైర్మన్ ఫయాజుర్ రెహమాన్ మాట్లాడుతూ నియోజక వర్గాన్ని ఎంఎల్‌ఎ అన్ని రంగాలలో అభివృద్ధి పథంలో తీసుకువెళ్తున్నారన్నారు. వైసిపి జిల్లా మైనారిటీ అధ్యక్షులు బేపారి మహమ్మద్‌ఖాన్ మాట్లాడుతూ క్రీడలకు జగన్ ప్రభుత్వం పెద్దపీట వేసిందన్నారు. ఈద్గా అభివృద్ధిలో ఎంపీ మిథున్ రెడ్డి, శ్రీకాంత్‌రెడ్డి కృషి గొప్పదన్నారు. విజేతలకు రూ.50 వేలు, రన్నర్స్‌కు రూ.30 వేలు బహుమతిని అబూ సిద్దిక్ ట్రావెల్స్ వారు అందిస్తున్నారని చెప్పారు. రూ 50 వేలు బహుమతిని తాను, రన్నర్స్‌కు రూ.30 వేలు బహుమతిని అబూ సిద్దిక్ ట్రావెల్స్ అందాచేస్తున్నారన్నారు. అనంతరం పట్టణంలోని ఈద్గాలో వజు ఖానా నిర్మాణం పనులను శ్రీకాంత్‌రెడ్డి పరిశీలించారు. త్వరితగతిన, నాణ్యతగా నిర్మాణ పనులను రంజాన్‌లోగా పూర్తయ్యేలా చూడాలని ఈద్గా వర్కింగ్ కమిటీ అధ్యక్షుడైన బేపారి మహమ్మద్ ఖాన్ కు ఎంఎల్‌ఎ సూచించారు. కార్యక్రమాలలో ఆసీఫ్ అలీఖాన్, ఫయాజ్ అహమ్మద్, సుగవాసి శ్యామ్, సుగవాసి ఈశ్వర్ ప్రసాద్, పల్లా రమేష్, జానం రవీంద్ర యాదవ్, అన్నసలీం, వాల్మీకి సంఘ జిల్లా అధ్యక్షుడు గువ్వల బుజ్జిబాబు, రియాజుర్ రెహమాన్, వెంకటేసు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న ఎమ్మెల్సీ అభ్యర్థి వెంకటేశ్వరరెడ్డి

## కాంట్రాక్ట్, అవుట్ సోర్సింగ్ ఉద్యోగులను రెగ్యులర్ చేయాలి

- పిడిఎఫ్ ఎమ్మెల్సీ అభ్యర్థి మీగడ వెంకటేశ్వరరెడ్డి

ప్రజాశక్తి-పీలేరు

రాష్ట్ర విద్యుత్ శాఖలో పనిచేస్తున్న కాంట్రాక్ట్, అవుట్ సోర్సింగ్ ఉద్యోగులందరినీ రెగ్యులర్ చేయాలని తూర్పు రాయలసీమ పట్టభద్ర ఎమ్మెల్సీ అభ్యర్థి మీగడ వెంకటేశ్వరరెడ్డి తెలిపారు. ఎన్నికల ప్రచారంలో భాగంగా శనివారం పీలేరులో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ విద్యుత్ శాఖలో 30 వేల మంది అవుట్ సోర్సింగ్ ఉద్యోగులు రాష్ట్రంలో రూ.12,500 నెలవారీ వేతనంపై పనిచేస్తూ అనేక ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని పేర్కొన్నారు. పెరిగిన నిత్యావసర వస్తువుల ధరలతో ఓ కుటుంబం రోజువారీ తమకందే రూ.400 వేతనంతో బతకడం సాధ్యమేనా అని ప్రశ్నించారు. సాధారణంగా ఉద్యోగులకు ప్రమోషన్‌తో పాటు జీతం పెరుగుతుందని, కానీ ఇక్కడ రూ.15 వేల జీతం తీసుకునే వాచ్‌మెన్ షిఫ్ట్ ఆపరేటర్‌గా ప్రమోషన్ పొంది రూ.13,500 జీతం తీసుకోవడం గర్హనీయమన్నారు. ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి తాను చేసిన పాదయాత్ర సందర్భంగా అధికారంలోకి వస్తూనే అవుట్ సోర్సింగ్ ఉద్యోగులైన కరెంట్ బిల్ రీడర్లకు పీస్ రేట్ విధానం రద్దు చేసి, నెల జీతం ఇస్తామని హామీ ఇచ్చారని, కానీ అది ఆచరణలోకి రాలేదని విమర్శించారు. గత 10 నుంచి 20 ఏళ్లుగా కాంట్రాక్ట్, అవుట్ సోర్సింగ్ ఉద్యోగులుగా పని చేస్తున్న వారు, ఎప్పుడు తమ విధులను క్రమబద్ధీకరిస్తారా అని చకోరపక్షుల్లా ఎదురు చూసే పరిస్థితి నెలకొందని తెలిపారు. ఇచ్చిన వాగ్దానం ప్రకారం కాంట్రాక్ట్ ఉద్యోగులు అందరినీ రెగ్యులర్ చేయాలని డిమాండ్ చేశారు. తాను పట్టభద్రుల నియోజకవర్గం నుంచి శాసనమండలికి ఎన్నికైతే ఈ సమస్యల పరిష్కారం కోసం తప్పక కృషి చేస్తానని, గ్రాడ్యుయేట్లందరూ తమ మొదటి ప్రాధాన్యత ఓటును తనకు వేసి, వేయించి గెలిపించాలని అభ్యర్థించారు. సమావేశంలో సిపిఎం నాయకులు వెంకట్రామయ్య, రవి, సిపిఐ నాయకులు వెంకటేష్, నరసింహులు పాల్గొన్నారు.

## పీలేరుకు తలమానికంగా మహాత్ముడి విగ్రహం

ప్రజాశక్తి-పీలేరు

శతాధిక సంవత్సరాల చరిత్ర కలిగిన పీలేరు గ్రామ పంచాయితీకి జిల్లా, రాష్ట్ర స్థాయిలో ప్రత్యేక గుర్తింపు తీసుకు రావడం కోసం జాతిపిత మహాత్మా గాంధీ విగ్రహాన్ని ఏర్పాటు చేయడానికి పూజా కార్యక్రమాలు చేసినట్లు సర్పంచ్, జిల్లా పంచాయతీ రాజ్ శాఖ అధ్యక్షులు డాక్టర్ షేక్ హబీబ్ బాష తెలిపారు. స్థానిక పంచాయతీ కార్యాలయం ఆవరణంలో 25 అడుగుల జాతిపిత విగ్రహ ఏర్పాటుకు శనివారం ప్రత్యేక పూజా కార్యక్రమాలు జరిపారు. ఈ సందర్భంగా గాంధీజీ చిత్రపటానికి పాలాభిషేక కార్యక్రమాన్ని కూడా నిర్వహించారు. ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ పీలేరు పట్టణంలో, గ్రామపంచాయతీకి ఓ ప్రత్యేక గుర్తింపును తీసుకురావాలన్న లక్ష్యంతో ఈ ఏడాది గణతంత్ర దినోత్సవం సంబరాల్లో భాగంగా 100 అడుగుల జాతీయ జెండాను ఆవిష్కరించడం జరిగిందన్నారు. అదే స్ఫూర్తితో మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి, ఎంపీ పెద్దిరెడ్డి వెంకట మిథున్ రెడ్డి, ఎమ్మెల్యే చింతల రామచంద్రారెడ్డి ఆశీర్వాదంతో, గ్రామపంచాయతీ పాలకమండలి ఆమోదంపై 25 అడవుల జాతిపిత మహాత్మా గాంధీ విగ్రహాన్ని కూడా ఏర్పాటు చేయడానికి సన్నద్ధమయ్యామని పేర్కొన్నారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే జివి శ్రీనాథ్ రెడ్డి, మాజీ మండల పరిషత్ అధ్యక్షులు కదిరి వెంకటరామయ్య, వైసిపి నాయకులు, వార్డు సభ్యులు, ఆర్యవైశ్య సంఘం నాయకులు బలస వేణు, సత్యనారాయణ శెట్టి, ఇతర ఆర్యవైశ్య సంఘ నాయకులు పాల్గొన్నారు.

గాంధీ చిత్రపటానికి పాలాభిషేకం చేస్తున్న నాయకులు

వీడ్కోలు సభలో నృత్య ప్రదర్శనలు చేస్తున్న విద్యార్థులు

## ఘనంగా విద్యార్థులకు వీడ్కోలు

**ప్రజాశక్తి-బి.కొత్తకోట**

పట్టణంలోని సుంకుఉషగౌతమి మెమోరియల్ జూనియర్ కాలేజిలో ఫేర్వెల్ డే వేడుకలను శనివారం ఘనంగా జరుపుకున్నారు. ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపల్ మంజునాథ్ మాట్లాడుతూ విద్యార్థులకు విలువలతో కూడిన విద్యను అందించడంలో మన కళాశాల ముందుంటుందని అన్నారు. క్రమశిక్షణగా చదువుకొని తల్లిదండ్రులకు, కళాశాలకు మంచిపేరు తీసుకొని రావాలని కోరారు. తమకు ఇష్టమైన రంగాన్ని ఎంచుకొని ఉన్నత శిఖరాలను అధిరోహించాలని ఆకాంక్షించారు. విద్యార్థులు ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. ఇంటర్ విద్యార్థులకు అధ్యాపకులు, మొదటి సంవత్సరం విద్యార్థులు ఘనంగా వీడ్కోలు పలికారు. **పుల్లంపేట :** మండల పరిధిలోని స్థానిక ఎస్‌బివిడి సభ జూనియర్ కళాశాలలో సీనియర్ విద్యార్థులకు జూనియర్ విద్యార్థులు ఘనంగా వీడ్కోలు పలికారు. ప్రిన్సిపల్ బాలాజీ మాట్లాడుతూ ఆత్మవిశ్వాసంతో ముందడుగు వేస్తే విజయం మీదే, బడిలో ఉపాధ్యాయులకు దండం పెట్టు - తల్లిదండ్రులకు అన్నం పెట్టు , భవిష్యత్తు మీ చేతుల్లోనే ఉందని కష్టాన్ని ఇష్టంగా మార్చుకోవాలని ప్రతి విద్యార్థి కష్టపడి బాగా చదివి రాగల పబ్లిక్ పరీక్షల్లో వందశాతం ఉత్తీర్ణత సాధించి ఉన్నత శిఖరాలకు అధిరోహించాలని అన్నారు. పరీక్షలో సమయం దగ్గర పడుతున్న వేళ ప్రతి విద్యార్థి కష్టపడి ప్రశాంత గల ప్రదేశాలలో ఏకాగ్రతతో చదివి పాఠశాలకు, ఉపాధ్యాయులకు, తల్లిదండ్రులకు మంచి పేరు తీసుకురావాలన్నారు. ఈ సందర్భంగా విద్యార్థులు ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. కార్యక్రమంలో కళాశాల కరస్పాండెంట్ నూకల శ్రీరాములు, అధ్యాపకులు, విద్యార్థులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

## ఎపిటిఎఫ్ జిల్లా కార్యదర్శిగా కుమార్ యాదవ్

**ప్రజాశక్తి-కలికిరి**

ఎపిటిఎఫ్ జిల్లా కార్యదర్శిగా కుమార్‌యాదవ్‌ను ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు రాష్ట్ర కార్యదర్శి చిరంజీవి తెలిపారు. జిల్లా కేంద్రం రాయచోటిలో జిల్లా కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. జిల్లా కార్యదర్శిగా కలికిరికి చెందిన పోతినేని కుమార్‌యాదవ్, అధ్యక్షులుగా ఇలియాజ్ అహ్మద్‌అలీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా ఎన్నికైన కుమార్‌యాదవ్ మాట్లాడుతూ ఉద్యోగ, ఉపాధ్యాయ సమస్యలపై పరిష్కారానికి కృషి చేస్తానని తెలిపారు. తనను ఏకగ్రీవంగా ఎన్నుకున్నందుకు కృతజ్ఞతలు తెలిపారు.

## 30 కి.మీ. దూరంలో పరీక్ష కేంద్రం

### ఆందోళనలో ఇంటర్ విద్యార్థులు

**ప్రజాశక్తి-గాలివీడు**

ఈ నెల 15 నుంచి 29వ తేదీ వరకు ఇంటర్మీడియట్ పరీక్షలు ప్రారంభం కానున్నాయి. పరీక్ష లను జంబ్లింగ్ విధానంలో నిర్వహించేందుకు అధికారులు ఇప్పటికే ఏర్పాట్లను పూర్తి చేశారు. మండల కేంద్రమైన గాలివీడులో మూడు ఇంటర్ కళాశాలల విద్యార్థులకు 30 కి.మీ దూరంలో ఉన్న జిల్లా కేంద్రం రాయచోటిలో పరీక్ష కేంద్రాలను ఏర్పాటు చేశారు. 265 మంది ఇంటర్ విద్యార్థులు రాయచోటికి వెళ్లి పరీక్షలు రాయనున్నారు. 1992 సంవత్సరం నుంచి ఇక్కడే ఉన్న ఆర్‌ఆర్ జూనియర్ కళాశాల పరీక్షా కేంద్రంగా కొనసాగుతుండేది. 2006వ సంవత్సరం నుంచి జంబ్లింగ్ విధానంలో భాగంగా రాయచోటిలో పరీక్షలను నిర్వహిస్తున్నారు. ప్రాక్టికల్ పరీక్షలు కూడా అక్కడే జరుపుతున్నారు. ప్రతి రోజూ 30 కి.మీ దూరం వెళ్లి పరీక్షలు రాయాలంటే విద్యార్థులు, తల్లిండ్రులు ఆందోళనకు గురవుతున్నారు. పరీక్షలు ముగిసేంత వరకు విద్యార్థికి, సహయకునికి ప్రతిరోజూ రూ.300 వరకు ఖర్చవుతుంది. ఇంటర్మీడియట్ పరీక్షకు ఆర్‌ఆర్ జూనియర్ కళాశాల, ఎంఎస్‌ఆర్ జూనియర్ కళాశాల, కెజిబివి జూనియర్ కళాశాలలో విద్యార్థులు పరీక్షలు రాస్తున్నారు. ఆర్‌ఆర్ జూనియర్ కళాశాలలో 197 మంది, ఎంఎస్‌ఆర్ జూనియర్ కళాశాలలో 38 మంది, కస్తూర్బా గాంధీ జూనియర్ కళాశాలలో 30 మంది పరీక్ష రాస్తున్నారు. విద్యార్థుల కష్టాలను దృష్టిలో ఉంచుకొని అధికారులు తగిన ఏర్పాట్లను తీసుకోవాలని విద్యార్థుల తల్లిదండ్రులు కోరుతున్నారు.

## బార్ అసోసియేషన్ అధ్యక్షులుగా నరసింహులు

**నందలూరు:** బార్ అసోసియేషన్ అధ్యక్షులుగా దాసరి నరసింహులు నాలుగవ సారి ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. శనివారం బార్ అసోసియేషన్‌లో జరిగిన సమావేశంలో న్యాయవాది ఒవి.కృష్ణారెడ్డి ఎలక్షన్ అధికారిగా కార్యక్రమాన్ని నిర్వహించగా సభ్యులందరూ దాసరి నరసింహులును బార్ అసోసియేషన్ అధ్యక్షులుగా నాలుగవ సారి ఏకగ్రీవంగా ఎన్నుకొన్నారు. ఉపాధ్యక్షులుగా షేక్ మహమ్మద్ అలీ, సెక్రటరీగా గొబ్బిల సుబ్బరామయ్య, జాయింట్ సెక్రటరీగా ఎస్. అనుదీప్ జయసింహ, ట్రెజరర్‌గా వినయ్, లైబ్రేరియన్ సెక్రటరీగా మాడపూరి నళిని, కల్చరల్ సెక్రటరీగా హెచ్. ఆనందకుమార్, స్పోర్ట్స్ సెక్రటరీగా సయ్యద్‌అలీ ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. సమావేశంలో సీనియర్ న్యాయవాదులు మల్లికార్జున, మేఘనాదం, శంకర్ లు పాల్గొని ఏకగ్రీవ తీర్మానం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బార్ పురోభివృద్ధికి, నూతన కోర్టు భవనానికి కృషి చేస్తానని తెలిపారు.

తలబడుతున్న అనంతపురం, విజయవాడ జట్లు

## 7 వికెట్ల తేడాతో అనంతపురం జట్టు విజయం

**కడప :** జిల్లా క్రికెట్ అసోసియేషన్ ఆధ్వర్యంలో స్థానిక వైఎస్ రాజారెడ్డి ఎసిఎ స్టేడియంలో జరుగుతున్న పిధనుంజయ రెడ్డి మెమోరియల్ వెటర్న్స్ టి-20 క్రికెట్ టోర్నమెంట్ లో భాగంగా శనివారం ఉదయం నిర్వహించిన మ్యాచ్‌లో విజయవాడ జట్టుపై ఏడు వికెట్ల తేడాతో అనంతపురం జట్టు ఘనవిజయం సాధించి ఫైనల్స్‌కు చేరుకుంది. మొదట బ్యాటింగ్ చేసిన విజయవాడ జట్టు 20 ఓవర్లలో 9 వికెట్ల నష్టానికి 152 పరుగులు చేసింది. ఆ జట్టులోని లెనిన్ 40 పరుగులు చేశారు. అనంతపురం జట్టులోని గులాం రెండు, హరినాథ్ రెడ్డి రెండు వికెట్లు తీసుకున్నారు. అనంతరం 153 పరుగుల విజయ లక్ష్యంతో బ్యాటింగ్‌కు దిగిన అనంతపురం జట్టు 18.2 ఓవర్లలో మూడు వికెట్ల నష్టానికి 154 పరుగులు చేసి 7 వికెట్ల తేడాతో ఘనవిజయం సాధించింది. ఆ జట్టులోని షహబుద్దీన్ 51 (నాటౌట్), సర్దార్ 42 (నాట్ అవుట్) పరుగులు చేశారు. విజయవాడ జట్టు లోని శ్రీకాంత్ రెండు వికెట్లు తీసుకున్నాడు.

**IN THE COURT OF THE 2nd Addl. Dist. JUDGE: MADANAPALLE**
**A.S. 20/2014**

P.Arunachalam & Others.
...Appellants
Vs
S.Habeebunnisa (died) & Others.
...Respondents

**NOTICE TO RESPONDENTS 8 TO 11**

R8. Shaik Ghouse Raja Ali, S/o S.Raja Ghouse peer, D.No. 37-1115-6, Chinnachowk, Kadapa Town and Dist.
R9. Shaik Raja Asif Ali, S/o S.Ghouse Raja Ali, D.No. 9-38, Saipeta, A1 Nagar, Kadapa Town & Dist.
R10. S.R.Siraj, S/o S.Ghouse Raja Ali, D.No.9-38, Saipeta, A1 Nagar, Kadapa Town & Dist.
R11. Shaik Raja Roshan Ali, S/o S.Ghouse Raja Ali, Golkonda Town, Chowk, Near Bandam Function Hall, Hasanath Colony, Hyderabad City, Telangana State.

పై అపీలు దావానందు ప్రతివాదులైన మీరు కోర్టు నుండి వచ్చిన అపీలు నోటీసులను మీరు తీసికోనందున సదరు నోటీసులను పత్రికా ముఖంగా తెలియపర్చుతూ మీ హాజరు నిమిత్తం 15-3-2023 నాటికి వాయిదావున్నది. మీరు కానీ, మీ ఉత్తర్వు పొందిన వారు కానీ పై కోర్టునందు పై తేదీనాడు ఉ॥గం॥10.30లకు హాజరు కావలెను. లేనంతట మీ పరోక్షమున కేసును తీర్మానించబడునని ఇందుమూలంగా తెలియజేయడమైనది.

**//By Order Of the Court//**
**Y. SAMBA SIVA REDDY** B.A., B.L.,.
**Advocate, Madanapalle-517 325.**

# అరాచక పాలనను అడ్డుకునేందుకే మద్దతు : 'బత్యాల'

**ప్రజాశక్తి-రాజంపేట అర్బన్**

సమావేశంలో మాట్లాడుతున్న బత్యాల చెంగల్రాయుడు

రాష్ట్రంలో అరాచక పాలనను అడ్డుకునేందుకే అఖిలపక్ష పార్టీలతో మద్దతు తీసుకోవడం జరిగిందని టిడిపి నియోజకవర్గ ఇన్‌ఛార్జి బత్యాల చెంగల్రాయుడు పేర్కొన్నారు. శనివారం స్థానిక టిడిపి కార్యాలయంలో అఖిలపక్ష నాయకులతో కలిసి విలేకరులు సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా బత్యాల మాట్లాడుతూ టిడిపి అధ్యక్షులు చంద్రబాబు నాయుడు పిలుపుమేరకు వైసిపి అక్రమాలను అడ్డుకునేందుకు అఖిలపక్ష మద్దతు కోరినట్లు తెలిపారు. రాష్ట్రంలో జరుగుతున్న ఐదు శాసనమండలి ఎన్నికలకు సంబంధించి సిపిఐ, సిపిఎం వారి అనుబంధ సంఘాలు, కార్మిక సంఘాలు, కాంగ్రెస్ పార్టీ మద్దతుతో టిడిపి బలపరుస్తున్న పశ్చిమ రాయలసీమ పట్టభద్రుల ఎమ్మెల్సీ అభ్యర్థి భూమిరెడ్డి రాంగోపాల్ రెడ్డికి మొదటి ప్రాధాన్యత ఓటు, పిడిఎఫ్ అభ్యర్థులుగా బరిలో నిలుస్తున్న ఉపాధ్యాయ ఎమ్మెల్సీ అభ్యర్థి కత్తి నరసింహారెడ్డి, పట్టభద్రుల ఎమ్మెల్సీ అభ్యర్థి పోతుల నాగరాజులకు రెండవ ప్రాధాన్యత ఓటు వేయాలని సూచించారు. పిడిఎఫ్ అభ్యర్థులను బలపరుస్తున్న ఉద్యోగ, ఉపాధ్యాయ సంఘాలు, విద్యార్థి, కార్మిక సంఘాలు మొదటి ప్రాధాన్యత ఓటును పిడిఎఫ్ అభ్యర్థులకు వేయాలని సూచించారు. సిపిఎం జిల్లా కార్యదర్శి చిట్వేలి రవికుమార్ మాట్లాడుతూ విద్యాబుద్ధులు నేర్పే గురువులు, విద్యావంతులు, మేధావులు చేతిలో శాసనమండలి భవిష్యత్తు ఆధారపడి ఉందని మేధావి వర్గం మేదోమధనం చేసి సరియైన అభ్యర్థిని ఎన్నుకోవాలని కోరారు. కార్యక్రమంలో సిపిఐ నాయకులు పి.మహేష్, ఎఐటియుసి నాయకులు ఎంఎస్ రాయుడు, శివరామకృష్ణదేవరా, ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి సర్వేపల్లి నరసింహ, టిడిపి మండల అధ్యక్షులు గన్నేసుబ్బ నరసయ్య నాయుడు, ఎస్‌సి సెల్ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి మందా శ్రీనివాసులు, కాంగ్రెస్ నాయకులు అత్తింజేరి శ్రీనాథ్ పాల్గొన్నారు.

# లోకేష్ ఆరోపణలు అర్థరహితం : ఎమ్మెల్యే

మాట్లాడుతున్న ఎమ్మెల్యే ద్వారకనథ్‌రెడ్డి

**ప్రజాశక్తి-బి.కొత్తకోట**

పెద్దిరెడ్డి కుటుంబమంటే అభివృద్ధికి చిరునామా అని, పాదయాత్రలో నారాలోకేష్ తమపై చేసిన ఆరోపణలు అర్థరహితమని ఎమ్మెల్యే పెద్దిరెడ్డి ద్వారకానాథ్‌రెడ్డి పేర్కొన్నారు. శనివారం మండలంలోని పెద్దతిప్ప సముద్రంలో విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నారా లోకేష్ పాదయాత్రతో మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి, ఎంపీ మిథున్‌రెడ్డి, తనపై పనిబట్టి ఆరోపణలు చేయడం సమంజసం కాదన్నారు. విజయ డైరీ మూసేసి విజయ డైరీలోని పరికరాలను మీ హెరిటేజ్ డైరీలో వాడడం లేదా అని ప్రశ్నించారు. కుప్పంలో ఏం అభివృద్ధి చేశారని చూపాలని, కనీసం సొంతిల్లు కూడా లేదని ఎద్దేవా చేశారు. వార్డు మెంబరుగా కూడా గెలిచే సత్తాలేని లోకేష్ సవాల్ విసరడం హాస్యాస్పదంగా ఉందన్నారు. విమర్శలు చేసే ముందు వాస్తవాలు గ్రహించి మాట్లాడాలని హితవు పలికారు. కార్యక్రమంలో పిటిఎం ఎంపిపి మహమ్మద్, జడ్‌పిటిసి ఉంగరాల శివన్న, సద్దాం, సాయి, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు. **బి.కొత్తకోట :** రాజంపేట ఎంపీ మిథున్ రెడ్డి సవాల్‌కు నారా లోకేష్ సిద్ధమా అని వైసిపి జిల్లా ఉపాధ్యక్షులు పాగొండ ఖలీల్ అహ్మద్ ప్రశ్నించారు. లోకేష్ తంబళ్లపల్లి నియోజకవర్గం అభివృద్ధిపై చర్చకు సిద్ధమా అని సవాల్ విసిరిన నేపథ్యంలో ఆ సవాల్ ను స్వీకరించిన ఎంపీ పెద్దిరెడ్డి మిథున్‌రెడ్డి, ఎమ్మెల్యే పెద్దిరెడ్డి ద్వారకనాథ రెడ్డిలు స్వీకరించారని అన్నారు. **మదనపల్లె అర్బన్:** నారా లోకేష్ చేస్తున్న యువగళం పాదయాత్రలో ఎంత మంది జనాలు ఉన్నారని, విమర్శించాలంటే ఒక స్థాయి ఉండాలని ఎమ్మెల్యే నవాజ్ బాషా పేర్కొన్నారు. తన నివాసంలో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశం ఆయన మాట్లాడుతూ తాను ఒక్కసెంటు భూమి కబ్జా చేశానని నిరూపిస్తే శాశ్వతంగా రాజకీయాలకు దూరంగా ఉంటానన్నారు. చంద్రబాబు ముఖ్యమంత్రిగా ఉన్నపుడే పెద్దిరెడ్డి జడ్‌పి చైర్మెన్ సీటు గెలిపించిన ఘనత కలిగిన వ్యక్తని అన్నారు. మంత్రి పెద్దిరెడ్డి కుటుంబంపై లేనిపోని ఆరోపణలు చేస్తే సహించేది లేదని హెచ్చరించారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్ పర్సన్ వి.మనూజా రెడ్డి, వైస్ చైర్మన్ జింక వెంకటాచలపతి, మార్కెట్ యార్డ్ డైరెక్టర్ శ్రీనివాసులురెడ్డి, రామాచార్లపల్లి ఎంపిటిసి కత్తి రాజా కిషోర్, చంద్రదేవ్ పాల్గొన్నారు.**మదనపల్లె అర్బన్ :** టిడిపి జాతీయ కార్యదర్శి నారాలకేష్ వాస్తవాలు తెలుసుకోకుండా ఆరోపణలు చేయడం తగదని జిల్లా వక్ఫ్ బోర్డు చైర్మన్ ఎస్.ఎ.కరీముల్లా ఖండించారు. జిల్లా అభివృద్ధి పై చిత్త శుద్ధి ఉంటే ఎంపీ సవాల్ ను స్వీకరించి, బహిరంగ చర్చలో పాల్గొనాలని, లేకుంటే లోకేష్ ముఖ్య మంత్రి వై ఎస్. జగన్ మోహన్ రెడ్డి, జిల్లా మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రా రెడ్డి, రాజంపేట ఎంపీ పెద్దిరెడ్డి మిథున్ రెడ్డి లపై చేసిన ఆరోపణలు ఉప సంహారించు కోవాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో వార్డు కన్వినర్లు రమాదేవి, వాసు, నాయకులు ఖలీల్, పాయాజ్ ఖాన్, కావ్య, సుమియా, షేక్ ఇమ్రాన్, ఎర్రంరెడ్డి పాల్గొన్నారు.

# ఎమ్మెల్సీ ఎన్నికలకు సర్వం సిద్ధం

**ప్రజాశక్తి-పుల్లంపేట**

పోలింగ్ కేంద్రాలను పరిశీలిస్తున్న తహశీల్దార్ నరసింహ కుమార్

మండల పరిధిలోని స్థానిక ఎస్‌బివిడి సభ హై స్కూల్లో 13న జరిగే ఎమ్మెల్సీ ఎన్నికలకు సర్వం సిద్ధం చేసినట్లు తహశీల్దార్ నరసింహ కుమార్ తెలియజేశారు. స్థానిక హై స్కూల్‌లో గల ఏర్పాట్లను శనివారం తహశీల్దార్ పరిశీలించారు. ఉపాధ్యాయ, పట్టుబద్రుల ఎన్నికల్లో ఎటువంటి చిన్న సమస్య తలెత్తకుండా పారదర్శకంగా, ప్రశాంత వాతావరణంలో ఎన్నికలు నిర్వహించేందుకు పోలింగ్ సిబ్బంది కృషి చేయాలని తెలిపారు. అధికారులకు కేటాయించిన పోలింగ్ కేంద్రాలను పరిశీలించి పోలింగ్ కేంద్రాల వద్ద ర్యాంపు వీల్ చైర్స్, విద్యుత్, తాగునీరు, వెబ్ క్యాసెటింగ్ చేయుటకు అవసరమైన విద్యుత్ సౌకర్యాలు ఉండేటట్లు చూడాలని ఉన్నారు. పోలింగ్ కేంద్రానికి 100 మీటర్ల వరకు 144 సెక్షన్ అమలులో ఉంటుందని 100 మీటర్ల వరకు మార్కింగ్ చేయాలని పోలింగ్ కేంద్రంలోనికి సెల్‌ఫోన్స్, టీ,కాఫీ, వాటర్ బాటిల్స్ పెన్నులు, అగ్గిపెట్టెలు, తీసుకెళ్లడానికి వీలు లేదని తెలిపారు. పోలింగ్ సమయం ఉదయం 8 గంటల నుంచి సాయంత్రం నాలుగు గంటల వరకు జరుగుతుందని తెలిపారు. మండలంలో 98 ఉపాధ్యాయ ఓట్లు, 986 పట్టుభద్రుల ఓట్లు ఉన్నాయని తెలియజేశారు.

# పసుపు నూర్పిడి పనులు ప్రారంభం

**ప్రజాశక్తి - చాపాడు**

పసుపు నూర్పిడి చేస్తున్న కూలీలు

రైతు బంగారంగా పేరొందిన పసుపు పంట నూర్పిడి పనులు ప్రారంభమయ్యాయి. నాణ్యత ఆశాజనకంగా ఉన్నట్లు రైతులు అభిప్రాయపడుతున్నారు. మండల పరిధిలో సుమారుగా రెండు వందల ఎకరాల్లో రైతులు పసుపు సాగు చేశారు. ప్రస్తుతం ఎద్దులతో, కూలీల ద్వారా దుక్కులు సాగిస్తున్నారు. చాపాడు, సీతారామపురం, చిన్నగురువలూరు, పెద్ద గురువలూరు, లక్ష్మీపేట, కేతవరం గ్రామాల పరిధిలో పసుపు రైతులు పనులు ప్రారంభించారు. ఎకరాకు 30 పుట్ల వరకు దిగుబడి వస్తున్నదని రైతులు చెబుతున్నారు. ఈ ఏడాది అధిక వర్షాల కారణంగా తెగుళ్ళతో దిగుబడి తగ్గిందని రైతులు పేర్కొంటున్నారు. రూ.లక్ష వరకు సాగు ఖర్చులు అయ్యాయని తెలిపారు. ఏడాది పంట కావడంతో కొనుగోలు దగ్గర నుండి సాగు, కూలీలు, ఎరువులు, మందులు కలిపి అధికంగా ఖర్చులు ఉన్నాయని రైతులు వివరించారు. కెసి కెనాల్ నీటి ఆధారంగా బోరు బావుల ద్వారా రైతులు పసుపు సాగు చేపడుతున్నారు. మైదుకూరు, దువ్వూరు మండలాల్లో రైతులు మరింత కాస్త ఆలస్యంగా దుక్కిళ్ళు చేసే అవకాశాలు ఉన్నాయి. మైదుకూరు మండలంలో విత్తనం కోసం ఏప్రిల్, మే నెలల్లో దుక్కులు చేపడతామని పేర్కొంటున్నారు.

## క్రీడలతో మానసిక ఉల్లాసం

**ప్రజాశక్తి - వల్లూరు**

యువకులకు క్రీడలు ఎంతో అవసరమని, క్రీడల వల్ల మానసిక ఉల్లాసం కలుగుతుందని ఎస్ఐ విష్ణువర్ధన్ తెలిపారు. మం డలంలోని అక్షింతరాయపల్లి ప్రీమి యర్ లీగ్ ఆధ్వర్యంలో జరుగుతున్న క్రికెట్ టోర్నమెంట్ పోటీలను శనివారం ఎస్ఐ, టిడిపి నాయకులు కాశిభట్ల సైనా శర్మ తన యుడు మణికంఠశర్మ టాస్‌వేసి ప్రారం భించారు. ఇరుజట్లకు శు భాకాంక్షలు తెలిపి మ్యాచ్ ప్రారం భించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ క్రీడా స్ఫూర్తితో ఆడి బహు మతులు గెలవాలని క్రీడాకారులకు సూచించారు. కార్యక్రమంలో క్రీడాకారులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

## నేడు విద్యుత్ సరఫరా నిలిపివేత

**ప్రజాశక్తి - వేంపల్లె**

వేంపల్లెలోని 33/11 కెవి సబ్‌స్టేషన్‌లో మరమ్మతులు చేస్తున్నందున ఆదివారం ఆయా ప్రాంతాల్లో విద్యుత్ సరఫరాను నిలిపేస్తున్నట్లు విద్యుత్ శాఖ జెఇ చంద్రశేఖర్ ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 7.30 గంటల నుండి 10.30 గంటల వరకు విద్యుత్ సరఫరా ఉండదన్నారు. ఈ నేపథ్యంలో టీచర్స్ కాలనీ, లయన్స్ నగర్, రాజీవ్‌నగర్ కాలనీ, ఎన్టీఆర్ సర్కిల్, పులివెందుల రోడ్డు, సాయినగర్, పిరమిడ్ నగర్, చైతన్య స్కూల్, కాపువీధి, పాతపేట, అమ్మవారిశాల, ఎస్సీ కాలనీ, గాజులపేట, గాండ్లవీధి, ప్రియా తోట, రెడ్డయ్య కాలనీ పరిసర ప్రాంతాల్లో విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని తెలిపారు. వినియోగదారులు సహకరించాలని ఆయన కోరారు.

**చక్రాయపేట :** మండలంలోని నాగులగుట్టపల్లి, కె.ఎర్రగుడి, సిద్దారెడ్డిపల్లె విద్యుత్ సబ్‌స్టేషన్‌ల మరమ్మతుల కారణంగా ఆదివారం ఉదయం 8.30గంటల నుంచి 11.30నిమిషాల వరకు విద్యుత్ సరఫరా ఉండదని ట్రాన్స్‌కో ఎఇఇ ప్రవీణ్‌కుమార్ యాదవ్ తెలిపారు. ఈ విషయాన్ని వినియోగదారులు గమనించాలని ఆయన కోరారు.

## సేవా కార్యక్రమాలు సంతోషకరం

**ప్రజాశక్తి - వేంపల్లె**

ఇడుపులపాయి ట్రిపుల్ ఐటి ఎన్ఎస్ఎస్ యూనిట్ సేవా కార్యక్రమాలను చేపట్టడం సంతోషకరమని ఆర్‌కె వ్యాలీ ఎస్ఐ రంగారావు పేర్కొన్నారు. చక్రాయపేట మండలంలోని మారేళ్ల మడక గ్రామంలో శనివారం ఏర్పాటు చేసిన రక్తదాన శిబిరంలో ఎస్ఐ రక్తదానం చేశారు. ఎన్ఎస్ఎస్ యూనిట్ ఆధ్వ ర్యంలో నాలుగు రోజులుగా చక్రాయపేట మండలంలో మొక్కలు నాటే కార్య క్రమంతోపాటు ఆయా కార్య క్రమాలు నిర్వహించారు. ఎస్ఐతోపాటు మరో 50 మంది యువకులు రక్తదానం చేశారు. అనంతరం ఎస్ఐ మాట్లాడుతూ రక్తదానం చేయడం వల్ల రోడ్డు ప్రమాదాల్లో గాయపడిన వారికి, గర్భిణులకు అవసరమైన రక్తం సరఫరా చేయవచ్చన్నారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి శ్రీహరి, సచివాలయం ఆరోగ్య కార్యకర్త నవనీత, ట్రిపుల్ ఐటీ ఎన్ఎస్ఎస్ యూనిట్ పోగ్రాం అధికారి డాక్టర్ రమేష్‌బాబు, ట్రిపుల్ ఐటీ విద్యార్థులు, సిబ్బంది ప్రసాద్ పాల్గొన్నారు.

## సాగునీటి రంగంపై నిర్లక్ష్యం : పిసిసి

**ప్రజాశక్తి - వేంపల్లె**

వైసిపి పాలనలో సాగునీటి రంగం పూర్తిగా నిర్లక్ష్యానికి గురైందని పిసిసి మీడియా చైర్మన్ తులసిరెడ్డి అన్నారు. శనివారం వేంపల్లెలో ఆయన విలేకరులతో మాట్లాడుతూ 2023-24 బడ్జెట్‌లోనైనా సాగునీటి రంగానికి అత్యధిక ప్రాధాన్యత ఇవ్వాలని కోరారు. రాష్ట్రంలో వ్యవసాయం ప్రధానమైందన్నారు. వ్యవసాయానికి సాగునీటి రంగం గుండెకాయ లాంటిదన్నారు. అలాంటి సాగునీటి రంగానికి బడ్జెట్‌లో ఎక్కువ నిధులు కేటాయించి, ఖర్చు చేయడం ప్రభుత్వ బాధ్యత అన్నారు. కాంగ్రెసు ప్రభుత్వాలు మొదటి నుండి కూడా సాగునీటి రంగానికి మొత్తం బడ్జెట్‌లో 15 నుండి 17 శాతం నిధులు కేటాయించి ఖర్చు చేసేవని అన్నారు. అందువల్లనే శ్రీశైలం రిజర్వాయర్, నాగార్జున సాగర్ ప్రాజెక్టు, ప్రకాశం బ్యారేజీ, ధవళేశ్వరం బ్యారేజీ పూర్తయినట్లు తెలిపారు. తెలుగుగంగ, గాలేరి-నగరి, హంద్రీ-నీవా, వెలిగోడు, పులిచింతల వంటి భారీ సాగునీటి ప్రాజెక్టుల్లో సింహ భాగం ప నులు కాంగ్రెస్ హయాంలోనే జరిగాయన్నారు. పోలవరం ప్రాజెక్టు పనులు 32 శాతం కాంగ్రెస్ హయాంలోనే పూర్తయ్యాయన్నారు. జాతీయ ప్రాజెక్టుగా ప్రకటించిందన్నారు. టిడిపి హయాంలో మొత్తం బడ్జెట్‌లో 9 శాతం మేరకే సాగునీటి రంగంపై ఖర్చు చేసిందన్నారు. వైసిపి పాలనలో సాగునీటి రంగానికి మరింత నిర్లక్ష్యం చేసిం దని తెలిపారు. మొత్తం బడ్జెట్‌లో 5 శాతం మాత్రమే కేటాయించి, అందులో సగం మాత్రమే ఖర్చు చేసిందన్నారు. రాష్ట్రంలోసాగునీటి ప్రాజెక్టులు నత్తనడకన సాగుతున్నాయని విమర్శించారు.కనీసం 2023-24 బడ్జెట్‌లోనైనా 15 శాతం కేటాయించి ఖర్చు చేయాలని తులసిరెడ్డి కోరారు.

వైద్యసేవలు అందిస్తున్న డాక్టర్.కిషోర్‌కుమార్‌రెడ్డి

## 104 సేవలను సద్వినియోగం చేసుకోండి

**ప్రజాశక్తి-కలకడ**

104 వైద్య సేవలను గ్రామీణ ప్రాంతాల్లో ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని ఎర్రకోటపల్లి వైద్యాధికారి కిషోర్‌కుమార్‌రెడ్డి సూచించారు. శనివారం మండలంలోని ఎర్రకోటపల్లి ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలో గంగాపురం, కత్తి వారిపల్లిలో డాక్టర్ యంవి.కిషోర్ కుమార్‌రెడ్డి ఆధ్వర్యంలో ఫ్యామిలీ పిజిషన్ కార్యక్రమాన్ని నిర్వహించినట్లు తెలిపారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ గర్భిణులు, బాలింతల పట్ల ప్రత్యేక శ్రద్ధ వహించాలని ఆరోగ్యకార్యకర్తలకు, ఆశ వర్కర్లకు సూచించారు. మాతృ శిశు మరణాలు జరగకుండా జాగ్రత్త వహించాలని తెలిపారు. 60 ఏళ్లు పైబడిన వారందరికీ రక్త పరీక్షలు నిర్వహించి మందులుపంపిణీ చేశామని చెప్పారు. 94 మందికి వైద్య సేవలు నిర్వహించి, ఉచితంగా మందులు పంపిణీ చేసినట్టు తెలిపారు. అంగన్వాడీ కేంద్రాన్ని తనిఖీ చేసినట్లు చెప్పారు. కార్యక్రమంలో ఎంపిహెచ్‌సిఓ జయరామయ్య ఆరోగ్యకార్యకర్త సి.లక్ష్మిదేవి, ఎంఎల్‌హెచ్‌పిఓ గోపిక్రిష్ణ, గణాంధిక అధికారి రోజా, ఫైలెట్ రమేష్, అమరావతి పాల్గొన్నారు.

## పాదయాత్రకు తరలివెళ్లిన టిడిపి శ్రేణులు

**పెద్దమండ్యం :**జాతీయ టీడీపీ కార్యదర్శి మాజి ముఖ్యమంత్రి తనయుడు నారా లోకేష్ తలపెట్టిన యువగళం పాదయాత్ర తంబళ్లపల్లి నియోజకవర్గం లో జరుగుతున్న పాదయాత్ర లో మండల అధ్యక్షులు జిట్టా వెంకటరమణ ఆధ్వర్యంలో టీడీపీ కార్యకర్తలు కురబలకోట మండలం అంగల్లులో జరుగుతున్న పాదయాత్రకు మండలం లోని నాయకులు తరలి వెళ్లారు. మండల అధ్యక్షులు జిట్టా వెంకటరమణ మాట్లాడుతూ రాబోయే ఎన్నికల్లో తెలుగుదేశం పార్టీ విజయం సాధించేలా ప్రతి ఒక్కరు కృషి చేయాలనీ పిలుపునిచ్చారు. ఈ పాదయాత్ర కు నాయకులు, యువకులు, మహిళలు భారీ ఎత్తున ఈ కార్యక్రమంనకు తరలి వెళ్లారు.

## వీధి శునకాలకు కుటుంబ నియంత్రణ టీకాలు

**ప్రజాశక్తి-మదనపల్లె అర్బన్**

మదనపల్లి పట్టణం నందు ఇటీవల కాలంలో వీధి సునకాల సమస్య అధికం కావడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్న నేపథ్యంలో శనివారం టీకాలు వేసే కార్యక్రమం కొనసాగింది. ఇటీవల జరిగిన కొన్ని సంఘటనలు ప్రజలను భయభ్రాంతులకు గురిచేసిన నేపథ్యంలో వీధి కుక్కల బెడద నియంత్రణ కోసం చర్యలు ప్రారంభమయ్యాయి. మదనపల్లి పట్టణం లో పలు వార్డు లలో కుక్కల సంతానోత్పత్తిని నియంత్రించే చర్యలు తీసుకొంటూ టీకాలు వేసే కార్యక్రమం చేపట్టారు. తద్వారా వాటి సంతతి నియంత్రణ కు శ్రీకారం చుట్టారు. వీధుల్లో సంచరించే కుక్కలను బంధించి వారికి టీకాలు వేయడంతో పాటు గుర్తులు నమోదు చేయడం జరుగుతుందని మున్సిపల్ అధికారులు తెలిపారు.

శునకాలకు టీకాలు వేస్తున్న మున్సిపల్ సిబ్బంది

# క్రైం కార్నర్

చీటింగ్ కేసులో అరెస్టయిన కోలా వెంకటరమణ

## చీటింగ్ కేసులో వ్యక్తి అరెస్టు

### - రూ.5 లక్షల నగదు స్వాధీనం

**ప్రజాశక్తి-గాలివీడు**

ప్రజలకు భూమి, ఇంటి పట్టాలు ఇప్పిస్తానని చెప్పి మోసం చేస్తున్న మండలంలో గాలివీడుకు చెందిన కోలా వెంకటరమణ అనే వ్యక్తి అరెస్టు చేసినట్లు పోలీసులు తెలిపారు. ఎస్ఐ వెంకట శివకుమార్ తెలిపిన వివరాల మేరకు తహశీల్దార్ కార్యాలయంలో విఆర్ఎగా పనిచేస్తున్న కోలా పద్మనాబయ్య అనారోగ్యంతో ఉండటంతో అతని స్థానంలో ఆయన కుమారుడు కోలా వెంకటరమణ విధులు నిర్వహించేవాడని తెలిపారు. మండలంలోని ప్రజలను భూమి, ఇంటి పట్టాలు ఇప్పిస్తానని నమ్మబలికి వారి నుంచి లక్షలాది రూపాయలు స్వాహా చేసినట్లు తెలిపారు. రాబడిన సమాచారం మేరకు అతన్ని అదపులోకి తీసుకొని, విచారించి అతని వద్ద నుంచి రూ.5లక్షలు నగదు స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. కేసు నమోదు చేసి కోర్టులో హాజరు పరిచినట్లు ఎస్ఐ తెలిపారు.

అగ్ని ప్రమాదంలో దగ్ధమైన పూరిళ్లు

## అగ్నిప్రమాదంలో పూరిళ్లు దగ్ధం

**ప్రజాశక్తి-తంబళ్లపల్లె**

అగ్ని ప్రమాదంలో పూరిల్లు దగ్నమై లక్ష రూపాయల ఆస్తి నష్టం జరిగిన సంఘటన శనివారం మండలం లో చోటు చేసుకుంది. స్థానికుల కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి. మండలంలోని గోపిదిన్నె పంచాయతీ బల్లాపురం వాండ్లపల్లికి చెందిన సుశీలమ్మ, ఒంటరి మహిళ పూరింట్లో ఉంటూ కూలి పనులతో జీవనం సాగించేదన్నారు. రోజు వారి సుశీలమ్మ ఉదయమే కూలి పనులకు వెళ్ళింది. మధ్యాహ్నం 12 గంటల సమయంలో ఇంట్లో విద్యుత్ వైర్లు షార్ట్ సర్క్యూట్ వల్ల నిప్పు రవ్వలతో మంటలు చెలరేగి ఉంటాయని గ్రామస్తులు అనుమానిస్తున్నారు. ఒక్కసారిగా మంటలు చెలరేగడంతో స్థానికులు గుర్తించి మంటలు ఆర్పే ప్రయత్నం చేశారు. చుట్టుపక్కల వ్యవసాయ పొలాలలో ఉన్న రైతులు హుటాహుటిన సంఘటన స్థలానికి చేరుకున్న మంటలు ఆర్పే ప్రయత్నం చేసిన ఫలితం లేకపోయింది. ఇంట్లో ఉన్న గ్యాస్ సిలిండర్ సైతం పెద్ద శబ్దంతో పేలింది. వంట పాత్రలు, బట్టలు, పొదుపు చేసుకున్న కూలి డబ్బులు సుమారు లక్ష రూపాయలు, 30 గ్రాముల బంగారు అగ్నికి ఆహుతి అయిందని సుశీలమ్మ కన్నీటి పర్యంతమైంది. నిరాశ్రయురాలిగా మిగిలిన బాధితురాలిని ఆదుకోవాలని గ్రామస్తులు కోరారు.